ప్రజలు మెచ్చేలా జగన్ పాలన

- మళ్లీ..మళ్లీ ఇలాంటి పాలనను కోరుకుంటున్న ప్రజలు
- మంత్రి జోగి రమేష్
- నెరికేపాలెం, కూడూరు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలిని సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

పెడన: ప్రజలు మెచ్చేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని, ఇటువంటి పాలన మళ్లీ..మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. మంగళవారం ఆయన నడుపూరు గ్రామ సచివాలయం పరిధిలోని నెరికేపాలెం, కూడూరు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఓటీఎస్ కింద దస్తావేజులను అందజేశారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ జగనన్న రూ.10 లక్షల విలువైన ఆస్తి రిజిస్ట్రేషన్ చేసి దస్తావేజులు లబ్ధిదారులకు అందజేశారని చెప్పారు. అటువంటి వ్యక్తికి మనమంతా అండగా నిలిచి మళ్లీ మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.

వెల్‌నెస్ సెంటర్, సచివాలయం భవనాల ప్రారంభం..

రూ.20.80 లక్షలతో వైఎస్సార్ క్లినిక్ (హెల్త్ వెల్‌నెస్ సెంటర్), రూ.43.60 లక్షలతో గ్రామ సచివాలయం నూతన భవనాలను మంత్రి జోగి రమేష్ ప్రారంభించారు. కూడూరు గ్రామంలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ పరంగా అందించే సేవలను చేరువ చేయడమే కాకుండా విద్యా, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి మనకే కాకుండా మన పిల్లల భవిష్యత్‌కు కూడా భరోసా కల్పిస్తున్న మహా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. నడుపూరు గ్రామ సచివాలయం పరిధిలో 431 మందికి ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. గ్రామంలో 172 మందికి జగనన్న అమ్మఒడి, 182 మందికి వైఎస్సార్ చేయూత, 57 గ్రూపులకు వైఎస్సార్ ఆసరా, 575 మందికి సున్నా వడ్డీ, 69 మందికి విద్యా దీవెన, 20 మందికి వాహన మిత్ర, 49 మందికి కాపు నేస్తం, 390 మంది రైతులకు రైతు భరోసా, నాలుగు లే అవుట్లలో 158 మందికి ఇళ్ల స్థలాలు తదితర పథకాల కింద లబ్ధి చేకూర్చినట్లు మంత్రి వివరించారు. నడుపూరు కొత్త కాలనీలో రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు మంత్రిని కోరగా, సీసీ రోడ్డు వేయిస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు. గ్రామంలో అక్కడక్కడా రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయించాలని మంత్రిని కోరారు. మంత్రి స్పందిస్తూ ప్రాధాన్యతా క్రమంలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

జనవరి నుంచి రూ.3 వేలు పెన్షన్..

వృద్ధులను, దివ్యాంగులను కలిసిన సమయంలో 2024 జనవరి నుంచి అంటే రెండు నెలల తరువాత పింఛను రూ.3 వేలు అవుతుందని మంత్రి తెలిపారు. అక్టోబర్ పూర్తికావడంతో నవంబర్, డిసెంబర్ తరువాత జనవరి నుంచి పింఛను మూడు వేల రూపాయలు ఇస్తారని చెప్పారు. ఇంటికి తీసుకువచ్చి ఇస్తున్నారా లేదా అంటూ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజులపాటి వాణి, మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ చారుమతి, సర్పంచ్ చీర్ల అనూష, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకట రామానాయుడు, అచ్యుతరావు, కాగిత వెంకటేశ్వరరావు, దావు భైరవలింగం, ఎంపీడీఓ రెడ్డయ్య, స్థానిక నాయకులు, మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం



చిలకలపూడి(మచిలీపట్నం): పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని జిల్ల కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. మంగళవారం ఆయన చాంబర్‌లో గుడివాడకు చెందిన భూ సమస్య పరిష్కరించినందుకు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానితో కలిసి రైతులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గుడివాడ బైపాస్‌రోడ్డు ఎదురుగా ఉన్న షాదీఖానా సమీపంలోని 2.03 ఎకరాల భూమి 2017లో సర్వే పేరుతో జమిందారీ భూమిగా మార్చారని కొడాలి నానికి తమ ఇబ్బందిని తెలియజేసిన వెంటనే ఆయన కలెక్టర్ రాజాబాబు ద్వారా భూమి సమస్యను పరిష్కరించి తమకు పట్టాలు ఇచ్చారని ఎస్‌కే షమ్ము, మొహమ్మద్ ఇలియాస్, షేక్ ఇమామ్, మురారి నరసింహారావు తదితరులు కలెక్టర్ వద్ద ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బాపులపాడులో 400 ఎకరాల భూమిని వెయ్యి మందికి పట్టాలుగా ఇచ్చామని, మచిలీపట్నం సర్కారుతోటలోని భూమిని పట్టాలుగా ఇచ్చామని వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాగాయలంక: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఏటిమొగ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు బుధవారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నాగాయలంక విద్యుత్ ఏఈ జి.ఏడుకొండలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామని చెప్పారు.

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

మచిలీపట్నంటౌన్: 46వ డివిజన్‌లో మంగళవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో దీర్ఘకాలంగా ఉన్న పారిశుద్ధ్య సమస్యలను కార్పొరేటర్ బి. సాయిబాబు దగ్గరుండి పరిష్కరించారు. బైపాస్‌రోడ్డు నుంచి ఈడేపల్లికి వెళ్లే రోడ్డులో డ్రెయిన్ లేకపోవడంతో గృహాల్లో వాడుక నీరు రోడ్లపైకి వదిలేస్తుండటంతో రోడ్డు మార్జిన్లలో మురుగునీరు చేరి దుర్వాసన వస్తోందని ఆ ప్రాంత ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో పారిశుద్ధ్య కార్మికులతో మురుగునీరు రోడ్డు ఆవల ఉన్న ఈడేపల్లి మెయిన్ డ్రెయిన్‌లో కలిసేలా పూడిక తీయించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను ప్రత్యేక ట్రాక్టర్‌లో డంపింగ్ యార్డుకు తరలించారు. కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య సహాయ మాత తేరు ఊరేగింపు

బందలాయిచెరువు(అవనిగడ్డ): బందలాయిచెరువు ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో నిత్యసహాయమాత తేరు ఊరేగింపు కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో నిత్యసహాయమాత స్వరూపాన్ని ఉంచి క్రైస్తవ గీతాలు ఆలపిస్తూ, ప్రార్థనలు చేస్తూ గ్రామంలో ఊరేగింపు సాగింది. అనంతరం కోటగిరిలంక విచారణ గురువు ఫాదర్ సురేష్ మెర్లో స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపదేశిలతో పాటు గ్రామ పెద్దలు గొరుముచ్చు కోటేశ్వరరావు, పరిశుద్ధరావు, దాసు, ఆరిగ సుబ్బారావు, సంఘస్తులు పాల్గొన్నారు.

దినేష్‌తేజకు అభినందన

కోనేరుసెంటర్: గ్రామ వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ ఫెడరేషన్ కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా కలపాల దినేష్‌తేజ నియమితులయ్యారు. దినేష్ బందరు మండలం తాళ్లపాలెం–2 గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి గ్రేడ్–5గా విధులు నిర్వహిస్తున్నాడు. దినేష్‌తేజను జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఎండీ జానీపాషా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దినేష్ తేజను పలువురు సచివాలయ ఉద్యోగులు అభినందించారు.

వృద్ధుడి కార్నియాల సేకరణ

తుంగలవారిపాలెం(అవనిగడ్డ): మండల పరిధి తుంగలవారిపాలెంకు చెందిన భోగిరెడ్డి వెంకట నాంచారయ్య (79) నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. వెంకట నాంచారయ్య మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందగా నాగాయలంకకు చెందిన సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్ మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడి నేత్రదానానికి అంగీకరింపజేశారు. విజయవాడకు చెందిన ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు చెందిన వైద్యులు వెంకట నాంచారయ్య కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు.

మెమెంటోల ప్రదానం

పెడన: ఎస్ఎంఎంఎస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు, అంతర్జాతీయ స్థాయి బాలల సైన్సు ప్రదర్శనలో విశేష ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటోలను మంగళవారం అందజేశారు. పట్టణంలోని భట్ల జ్ఞానకోటయ్య జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రైల్వే మజ్దూర్ యూనియన్ యువజన కార్యదర్శి రామసతీష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఇతర అంశాల్లోనూ ప్రతిభ చూపాలని చెప్పారు. వార్డు కౌన్సిలర్ పిచ్చిక సతీష్, స్కూల్ హెచ్ఎం ఉషా, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

13న 'జగనన్నకు చెబుదాం'

చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 13న చల్లపల్లిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ కె.గోపాలకృష్ణ తెలిపారు. గ్రామంలోని పెద్దకళ్లేపల్లి రోడ్డులో కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శిబిరం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని చెప్పారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

చల్లపల్లి: దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న కోమలా నగర్ డ్రెయినేజీ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. గ్రామ పంచాయతీ సాధారణ నిధులు రూ.3 లక్షలతో స్థానిక కోమలానగర్ ఎదురుగా జెడ్పీ హైస్కూల్ వైపునకు తూము కల్వర్టు నిర్మాణ పనులను సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు పూజలు చేసి ప్రారంభించారు.

15 నుంచి ఉత్సవాలు

కోడూరు: కోడూరు గంగాభవానీ అమ్మవారి ఆలయంలో ఈ నెల 15 నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు మంగళవారం తెలిపారు. 15 నుంచి 23వ తేదీ వరకు ప్రతి రోజూ అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని వివరించారు.

నిరుపేదలకు చేరువగా కార్పొరేట్ వైద్యం



నందమూరు శిబిరంలో సిబ్బందికి సూచనలిస్తున్న రాజ్యలక్ష్మి



రామానగరం శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెడన: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం చేరువైందని ముడా వైస్ చైర్మన్ కె. రాజ్యలక్ష్మి అన్నారు. నందమూరు జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ పరసా నరసింహారావు, ఎంపీటీసీ బొల్లా ఉదయ్‌నాగకుమార్ ప్రారంభించగా రాజ్యలక్ష్మి శిబిరాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య సేవలను ప్రజలకు చేరువ చేసి కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నారని చెప్పారు. వైద్య నిపుణులు సోదేష్‌బాబు, అఖిలాండేశ్వరి, మీనాదేవి, ప్రదీప్‌కుమార్, ఇబ్రహీంలు వైద్య పరీక్షలు నిర్వహించారు. 321 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. వీరిలో 81 మందికి కంటి పరీక్షలు చేయగా 36 మందిని కళ్లజోళ్లకు రిఫర్ చేశారు. ముగ్గురిని కంటి శస్త్ర చికిత్సల కోసం మచిలీపట్నం కంటి ఆస్పత్రికి, గుండె శస్త్ర చికిత్సల కోసం ఇద్దరిని, జనరల్ సర్జరీ కోసం మరో ఇద్దరిని విజయవాడకు రిఫర్ చేశారు.

జిల్లా ప్రత్యేకాధికారి సందర్శన..

కమ్మనమోలు(నాగాయలంక): మండలంలోని కమ్మనమోలు సచివాలయం పరిధిలో మంగళవారం ఆరోగ్య సురక్ష శిబిరం ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. జేఏఎస్ జిల్లా ప్రత్యేకాధికారి, మత్స్యశాఖ జేడీ ఎన్.శ్రీనివాసరావు శిబిరాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. 523 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ, క్యాంప్ ఇన్‌చార్జి డాక్టర్ తారకేశ్వరరావు, సొర్లగొంది, ఎదురుమొండి, పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్, డాక్టర్ రాజేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ..

వెంకటాపురం(మోపిదేవి): ప్రజల ఆరోగ్యం విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ అన్నారు. వెంకటాపురం జెడ్పీ పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సర్పంచ్ తుమ్మా సోములమ్మ, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ ఎం. శ్రావణి, డాక్టర్ నితిన్, డాక్టర్ హారిక, డాక్టర్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

464 మందికి వైద్య పరీక్షలు..

గూడూరు: గూడూరు మండలం ఐదుగుళ్లపల్లిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 464 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేరు. శిబిరాన్ని ఎంపీపీ సంగా మధుసూదనరావు ప్రారంభించారు. జెడ్పీటీసీ వేముల సురేష్‌రంగబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకటకృష్ణారావు, ఏపీఎస్ఎంఎస్‌సీ డైరెక్టర్ కామేశ్వరరావు, ఎంపీడీఓ సుబ్బారావు, తహసీల్దార్ విజయ్‌ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు. మల్లవోలు పీహెచ్‌సీ వైద్యాధికారి టి. మాధురి ఆధ్వర్యంలో మచిలీపట్నం, గూడూరు ఆస్పత్రుల వైద్య నిపుణులు వైద్య సేవలు అందించారు.

- **కోనేరుసెంటర్:** జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలందరికీ రక్ష అని బందరు ఎంపీడీఓ బాలకృష్ణ అన్నారు. ఎస్ గొల్లపాలెం సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.
- **కృత్తివెన్ను:** చినగొల్లపాలెం–1 సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ ప్రారంభించారు. వైద్య పరీక్షల తీరును పరిశీలించి, రోగులకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. జెడ్పీటీసీ రత్నకుమారి, సర్పంచ్ సునీల్, జేసీఎస్ మండల కన్వీనర్ బాపూజీ, ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, వైద్యులు పాల్గొన్నారు. చోరంపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 468 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. జోగి రాజీవ్, కె. రాజ్యలక్ష్మి, ఎంపీపీ వి. చిన బాబు తదితరులు పాల్గొన్నారు.

లింగారెడ్డిపాలెంలో..

కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెంలో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో 457 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆర్థోపెడిక్, నేత్ర, జనరల్ వైద్య నిపుణులు శైలేంద్ర కుమార్, జితేంద్ర, అవినాష్, మౌనికలు రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

- **లక్ష్మీపురం(చల్లపల్లి):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు అన్నారు. మంగళవారం లక్ష్మీపురం గ్రామ సచివాలయం–3 పరిధిలోని రామానగరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 400 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందచేశారు. సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, ఈఓఆర్డీ అశోక్, పంచాయతీ ఈఓ ఆకుల సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గంజాల శ్రీనివాసరావు, శివరాం శిబిరాన్ని పర్యవేక్షించారు.

క్రీడల్లో తోటమూల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్ఎం నాగేశ్వరరావు తదితరులు

పెడన: పెడన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో పెడన తోటమూల విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల హెచ్ఎం చింతలపాటి నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. పోటీలు గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగాయని చెప్పారు. బాలుర విభాగంలో 100, 400 మీటర్ల పరుగులో పి. సాయి చరణ్ ద్వితీయ స్థానం, షాట్ పుట్ జూనియర్స్‌లో పి. శ్రీ చరణ్ తృతీయ, అండర్ –14 బాలుర విభాగంలో 600 మీటర్ల పరుగు పోటీల్లో డి. జితేంద్ర ద్వితీయ, అండర్– 17 విభాగంలో 400 మీటర్ల పరుగు పోటీల్లో బి. పండు ద్వితీయ, డిస్కస్ త్రోలో వి. చరణ్ ద్వితీయ స్థానంలో నిలిచారని చెప్పారు. బాలికల విభాగంలో 100 మీటర్ల పరుగులో ఎం. నవ్య ప్రథమ స్థానం, గౌతమి ప్రియ తృతీయ స్థానం సాధించారన్నారు. 400 మీటర్ల పరుగులో కె. ధనుష్క, 100 మీటర్ల పరుగులో డి. దాక్షాయణి ద్వితీయ స్థానం, 200 మీటర్ల పరుగులో నవ్య ప్రథమ, గౌతమీప్రియ ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. 200 మీటర్ల జూనియర్స్ పరుగు పోటీల్లో టి. కీర్తి ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. అండర్–17 లాంగ్ జంప్‌లో గౌతమీప్రియ తృతీయ స్థానం, అండర్–14 విభాగంలో 200 మీటర్ల పరుగులో ధనుష్క ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహారావును హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి నుంచి గూడూరు స్థలాల రిజిస్ట్రేషన్లు

గూడూరు: గూడూరులో నిలిచిన స్థలాల రిజిస్ట్రేషన్లు బుధవారం నుంచి యథావిధిగా ప్రారంభమవుతాయని గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరు గ్రామంలోని సర్వే 393/1లోని 260 ఎకరాలలో గత ఏడేళ్లుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో మంత్రి జోగి రమేష్ చొరవతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కొనసాగించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రిజిస్ట్రేషన్ల నిర్వహణలో సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యాయి. స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఆయా సమస్యలను అధిగమించడంతో రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం అయింది. మంగళవారం మచిలీపట్నం సబ్ రిజిస్ట్రార్ జగన్మోహనరావును కలిసిన రాంబాబు, కృష్ణారావులు రిజిస్ట్రేషన్ల ప్రారంభంపై చర్చించారు. దీంతో బుధవారం నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తామని సబ్ రిజిస్ట్రార్ జగన్మోహనరావు తెలిపారు.

సక్రమంగా డంపింగ్‌యార్డు నిర్వహణ

మేయర్ వెంకటేశ్వరమ్మ



వృద్ధురాలిని సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: డంపింగ్ యార్డు నిర్వహణ సక్రమంగా ఉండాలని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. 36వ డివిజన్ రాజుపేట ప్రాంతంలో మేయర్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా నగర డంపింగ్‌యార్డును పరిశీలించారు. డంపింగ్‌యార్డు వద్ద రోడ్డు పైకి వచ్చిన వ్యర్థాలను చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్‌యార్డు నిర్వహణ ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని సూచించారు. నగరం నుంచి సేకరించిన చెత్తను రోడ్డుపై వేయకుండా డంపింగ్ యార్డు పైకి చేర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డంపింగ్‌యార్డు నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ఆ ప్రాంతంలోని పేర్ని నాని నగర్, కరెంట్ కాలనీ, రాజుపేట ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో ఆమె పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం నిర్వహణ ఎలా ఉన్నదీ మహిళలను ఆరా తీయగా బాగానే ఉందని వారు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ జ్యోతిలక్ష్మి, 36, 37, 38 డివిజన్ల కార్పొరేటర్లు మాచవరపు రాంప్రసాద్, ఐనం తాతారావు, గోపిశెట్టి సతీష్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఎంపీపీ గరుడప్రసాద్

కృత్తివెన్ను: ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీపీ గరుడప్రసాద్ అన్నారు. మంగళవారం కృత్తివెన్ను మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాలలో జ్వరపీడితులు ఎక్కువగా ఉన్నారని, బాధితులు అశ్రద్ధ చేయకుండా ముందుగా సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. శాఖల వారీగా ఉద్యోగుల పనితీరు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సాగునీటి కొరత లేకుండా చూడాలని పలువురు ఎంపీటీసీలు సమావేశంలో ఎంపీపీని కోరారు. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థులకు ఫ్రీ అడ్మిషన్లు ఇవ్వాలని, ఈ విధానం అమలు జరుగుతుందో లేదో పర్యవేక్షించాల్సిన బాధ్యత ఎంఈఓలపై ఉందని జెడ్పీటీసీ రత్నకుమారి అన్నారు. సమావేశంలో ఎంపీడీఓ పిచ్చిబాబు, వివిధ శాఖల ఉద్యోగులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సుబ్బారాయుడి సన్నిధిలో పీఆర్ చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి



మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామివారి లడ్డూ ప్రసాదం అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. పంచాయతీరాజ్ ఈఈలు ఏవీఎస్ శ్రీనివాసరావు, శివప్రసాద్, డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ శ్రీనివాస్, సిబ్బంది, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

మచిలీపట్నంటౌన్: స్థానిక గాంధీబొమ్మ శివాలయంలో నిర్వహించనున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు ఆలయంలో జరుగుతాయని ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తమ్మన రాధాకృష్ణమూర్తి, కార్యదర్శి యెండూరి సురేష్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. అలాగే బుట్టాయిపేటలోని గణపతి సచ్చిదానంద దత్తాశ్రమంలో ఈ నెల 15 నుంచి ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజూ అమ్మవారు వివిధ అలంకారాల్లో దర్శనమిస్తారని వివరించారు.

గూడూరులో నా మట్టి–నా దేశం ర్యాలీ

గూడూరు: ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం గూడూరులో నా మట్టి నాదేశం కలశ యాత్ర నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమైంది. నెహ్రూ యువ కేంద్రం చాంపియన్ షేక్ షబానాకు కలశాన్ని అందజేశారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సురేష్ రంగబాబు, ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కామేశ్వరరావు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల కృష్ణా, ఎంపీడీఓ సుబ్బారావు, నాయకులు పర్ణం మహాలక్ష్మయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు, హక్కులపై అవగాహన అవసరం

పెడన: భారత రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య అన్నారు. మంగళవారం బల్లిపర్రు సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. రామకృష్ణయ్య మాట్లాడుతూ నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, చట్టాలను, నిర్బంధ విద్యాహక్కు చట్టం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం, ఆత్మహత్యల నివారణ చట్టం, మహిళలకు ఆస్తిలో కల్పించిన హక్కులు తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. పెడన సీఐ హబీబ్‌బాషా, న్యాయవాది సీహెచ్ మునలయ్య, ప్రభుత్వ మాజీ న్యాయవాది ఆజ్మతున్నీసా, పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. రూతమ్మ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు వేణుగోపాలరావుకు సన్మానం



ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలం గోగినేనిపాలెం హైస్కూల్ హెచ్ఎంగా పనిచేస్తూ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సాధించిన తమ్మన వేణుగోపాలరావును మంగళవారం ఘనంగా సత్కరించారు. ఢిల్లీలోని మన్నం ఫౌండేషన్ ద్వారా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఆయన అందుకున్నారు. స్థానిక హైస్కూల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వేణుగోపాలరావును ఏపీ హైకోర్టు అడ్వకేట్ బడిగే వెంకటప్పయ్య సింహాచలం, అమ్మిరెడ్డి రజని ఘనంగా సత్కరించారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

కోడూరు: కోడూరు–3 సచివాలయ పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తామని ఎంపీడీఓ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఇస్మాయిల్‌బేగ్‌పేట ఎంపీపీ పాఠశాల ఆవరణలో జరిగే శిబిరంలో పలు విభాగాలకు చెందిన వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని చెప్పారు.

జర్నలిస్టులకు రెండో విడత అక్రిడిటేషన్లు మంజూరు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో 2023–24 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత కలిగిన జర్నలిస్టులకు రెండో విడత అక్రిడిటేషన్లు మంజూరు చేశామని కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. ఆయన చాంబర్‌లో మంగళవారం అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేస్తూ కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, ఆర్టీసీ డిపో మేనేజర్ టి. పెద్దిరాజు, కార్మిక శాఖాధికారి ఎస్. గోవింద్, రైల్వే అధికారి సయ్యద్ అమీర్, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌బీ సతీష్‌కుమార్, కమిటీ సభ్యులు పైడేశ్వరరావు, కె. గణేష్‌కుమార్, రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖాధికారి ఎం. వెంకటేశ్వరప్రసాద్, డివిజనల్ పీఆర్వో జి. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా విశ్వవిద్యాలయంలో ప్రథమ చికిత్సా కేంద్రం

కోనేరుసెంటర్: విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరచాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జి. జ్ఞానమణి అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రథమ చికిత్సా కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా విశ్వవిద్యాలయంలో ప్రథమ చికిత్సా కేంద్రం అవసరం ఉందని, అవసరమైన అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచుతామన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ బ్రహ్మచారి మాట్లాడుతూ విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ఒక జీఎన్ఎంను నియమించామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుందరకృష్ణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమార్, పలువురు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.